
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 20 జనవరి 2025 | 5





ఎన్టీఆర్ బీచ్‌లో మారథాన్‌లో పాల్గొని కేరింతలు కొడుతున్న యువకులు

# కాకినాడ బీచ్‌లో మారథాన్



మారథాన్‌లో పాల్గొన్న యువత



కాకినాడ బీచ్‌లో పర్యాటకుల సందడి

» పలు సంస్థల సహకారంతో ఏడోసారి నిర్వహణ

సర్పవరంజంక్షన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్‌లో ఆదివారం కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్, ఓఎన్‌జీసీ, ఎపెక్స్, రిలయన్స్, దేవీ సీఫుడ్స్, జీఆర్‌టీ తదితర సంస్థల సహకారంతో 7వ మారథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, పెద్దలు, మహిళలకు 21 కిలోమీటర్లు, 10, 5, 3 కిలోమీటర్ల విభాగాల్లో మారథాన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యువత, విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ ఏడాది మారథాన్ ప్రధాన ఉద్దేశంతో మహిళలు, బాలికలపై అణచివేతను ఆపుదాం అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కేఎస్‌పీఎల్ సీఈవో ఎం.మురళీధర్ తెలిపారు. దైనందిన జీవితంలో శరీరానికి తగినంత వ్యాయామం లేక పలు రకాల రోగాల బారిన ప్రజలు పడుతున్నారన్నారు. నడక, పరుగుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా జనవరిలో మారథాన్ పోటీ నిర్వహిస్తున్నామన్నారు. మారథాన్‌లో ప్రతిభ చూపిన పలువురికి నగదు బహుమతి, స్మారక చిహ్నాలు అందజేశారు. కార్యక్రమంలో పలు కంపెనీలకు చెందిన అధికారులు, సిబ్బంది, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సందర్శకులతో కిక్కిరిసిన బీచ్

కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ ఆదివారం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. సంక్రాంతి పండుగ తర్వాత ఆదివారం కావడం, పండుగ కోసం ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన కుటుంబసభ్యులు పెద్ద ఎత్తున బీచ్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువకులు, పెద్దలు సముద్ర స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. లైట్ హౌస్ సమీపంలో ఉన్న శిల్పారామాన్ని సందర్శించారు. కాకినాడ మెరైన్ సీఐ రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ సురేష్, ఏఎస్ఐలు అబ్బాయిరెడ్డి, మధుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది గజఈతగాళ్లతో బందోబస్తు నిర్వహించారు. యువత సముద్రస్నానాలు చేయకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ హెచ్చరికలు చేశారు. బీచ్‌రోడ్డులో వాహనాల రద్దీతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

## ముగిసిన రేషన్ డీలర్ల పరీక్ష

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులకు సంబంధించి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, జేసీ రాహుల్‌మీనా తెలిపారు. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా ఉన్న 21 మండలాల్లో 146 రేషన్‌షాపుల ఖాళీలకుగాను 709మందికి కాకినాడ, పెద్దాపురం డివిజన్‌లో ఏర్పాటుచేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 654మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. కాకినాడ డివిజన్‌కు సంబంధించి 10 మండలాల్లో ఉన్న 96ఖాళీలకుగాను 584 అభ్యర్థులకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీఆర్ జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహించగా 535మంది పరీక్షకు హాజరయ్యారు. పెద్దాపురం డివిజన్‌లోని 11 మండలాల్లో 50 రేషన్ డీలర్ల ఖాళీలకు 125మందికి పెద్దాపురం ఎంఆర్ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహించగా 119మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పాల్గొన్నారు.

## ఉచిత గ్యాస్ పథకంలో అదనపు చార్జీలు వసూళ్లు చేస్తే చర్యలు

» ఇన్‌చార్జి డీఎస్‌వో లక్ష్మీదేవి

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గ్యాస్ పథకంలో ఎల్‌పీజీ డెలివరీ బాయ్స్ అదనపు చార్జీలు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి డీఎస్‌వో ప్రసన్న లక్ష్మీదేవి హెచ్చరించారు. ఈ మేరకు ఒక ప్రకటన ఆదివారం విడుదల చేశారు. డెలివరీ బాయ్స్ అదనంగా చార్జీలు వసూళ్లు చేస్తున్నారని తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్యాస్ ఏజెన్సీలను కూడా బ్లాక్ లిస్ట్‌లో పెట్టి లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. 15కిలోమీటర్లలోపు లబ్ధిదారులు ఎలాంటి అదనపు చార్జీలు ఇవ్వనవసరం లేదన్నారు. 15 కిలోమీటర్లు దాటిన వినియోగదారులు కేవలం రూ.30 అదనంగా చెల్లించాలన్నారు. డెలివరీ బాయ్స్ అధికంగా చార్జీలు వసూళ్లు చేస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1967కి చేయాలన్నారు. జిల్లా పౌర సరఫరాలశాఖ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయాలన్నారు.



అయ్యో పాపం : ఇటీవల కాకినాడ సముద్ర తీరాన మృత్యువాత పడిన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు

# నో..లివ్!

## తీరాన ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మృత్యుఘోష

» గుడ్లు పెట్టేందుకు వచ్చి మృతి
» తీరం పొడవునా కళేబరాలు
» కాలుష్యమే కారణంగా అంచనా
» ఒక్కో తాబేలు 120 గుడ్లు
» అయినా అంతరించే ప్రమాదం
» డిప్యూటీ సీఎం పవన్ దృష్టి
» హోప్‌ఐలాండ్‌లో వేట నిషేధం
» కాపాడేందుకు చర్యలు

సర్పవరం జంక్షన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సాగరతీరంలో అరుదైన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. వేల కిలోమీటర్ల నుంచి రాష్ట్ర తీరప్రాంతానికి గుడ్లు పెట్టేందుకు వస్తున్న తాబేళ్లు సముద్రతీరంలో ఎక్కడ చూసినా చనిపోయిన దర్శనమిస్తున్నాయి. సముద్రంలో అరుదుగా లభించే జాతిగా పేరొందిన ఈ తాబేళ్లు విదేశాల నుంచి వేలాది కిలో మీటర్లు ఈదుకుంటూ వచ్చి తీరప్రాంతంలో గుడ్లు పెడతాయి. అలా వచ్చిన తాబేళ్లు చనిపోతుండడం కలవరానికి గురిచేస్తోంది. తీరప్రాంతాలకు ఆనుకుని ఉన్న పరిశ్రమల నుంచి విడుదలవుతున్న రసాయన కాలుష్యం,వేటగాళ్ల వలలకు చిక్కుకోవడం, ఇంజన్ పంకాకు తాబేళ్లు తగిలి మృత్యువాత పడుతున్నట్టు అంచనా. దీనిపై ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాబేళ్లను సంరక్షించాలని..మృతికి గల కారణాలు అధ్యయనం చేయాలని.. సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు అటవీ అధికారులు కాకినాడ హోప్ ఐలాండ్ ప్రాంతంలో తాబేళ్ల సంరక్షణలో భాగంగా మార్చి వరకు చేపల వేట నిషేధించారు.

### గుడ్లు పెట్టేందుకే రాక..

రాష్ట్రంలో 974 కిలోమీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. ఆలివ్ రిడ్లీ తాబేళ్లు థాయిలాండ్, మలేషియా, ఇండోనేషియా తదితర తీర ప్రాంత దేశాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి కాకినాడ, కోనసీమ, బాపట్ల, నెల్లూరు తీర ప్రాంతాలకు డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో గుడ్లు పెట్టేందుకు వస్తాయి. ఇవి రాత్రి సమయంలో తీరంలోని సముద్ర ఇసుకలోకి వచ్చి గోతులు తయారు చేసుకుని, వాటిలో ఒక్కో ఆడ తాబేలు 60 నుంచి 120 వరకు గుడ్లు పెడుతుంటాయి. గుడ్డు నుంచి పిల్లగా మారేందుకు 50 రోజుల సమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. గుడ్లు పెట్టేందుకు ఒక్కో గొయ్యి కోసం ఇవి సుమారు గంట వరకు సమయం తీసుకుంటాయి. జనసంచారం, జంతువుల సంచారం లేని రాత్రి సమయంలో ఇవి ఒడ్డుకు వచ్చి గుడ్లు పెడతాయి. అయితే జిల్లాలో అద్దరిపేట సముద్ర తీరం నుంచి కాకినాడ తీరం వరకు 35 కిలోమీటర్ల మేర ఎక్కడ చూసినా మృతి చెందిన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు దర్శనమిస్తున్నాయి. ఉప్పాడ, కాకినాడ రూరల్ నేమాం, సూర్యారావుపేట, వాకలపూడి, కుంభాభిషేకం బీచ్‌లో తాబేళ్ల కళేబరాలు దర్శనమిస్తోండడం ఆందోళన కలిగిస్తోంది. సముద్ర తీరం ఆనుకుని ఉన్న పలు పరిశ్రమలు విడుదల చేసే కాలుష్య కారకాలతో ఇవి మృతి చెందుతున్నాయి. మత్స్యకారులు ఇంజన్ బోట్లతో చేపల వేటకు వెళ్లే సమయంలో వలలో చిక్కుకోవడం, ఇంజన్ బోటు పంకాల్లో పడి ఇవి మృత్యువాత పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు.

### జెల్లీ చేపలే ఆహారం..

సముద్ర పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు కీలకపాత్ర పోషిస్తాయి. సముద్రంలో ఆక్సిజన్, చేపల సంతానం వృద్ధికి తాబేళ్లు దోహదం చేస్తాయి.సముద్రంలో ఉండే చేపపిల్లలను ఆహారంగా తీసుకుని జీవించే జెల్లీ చేపలను తాబేళ్లు ఆహారంగా తీసుకుంటాయి.దీంతో మత్స్య సంపద అంతరించకుండా వృద్ధి అయ్యేలా పరోక్షంగా కీలకపాత్ర పోషిస్తాయి. తాబేలు లోతులో ఉన్నా ప్రతి 45 నిమిషాలకు ఒకసారి సముద్రం పైకి వచ్చి ఆక్సిజన్ విడుదల చేస్తుంది. అలా సముద్రం పైకి, లోపలికి వచ్చి, వెళ్లడం ద్వారా నీటిలో ఆక్సిజన్ శాతం పెరుగుతుంది. సముద్ర పర్యావరణాన్ని కాపాడేందుకు తాబేళ్లు మేలు చేస్తాయి.

### అరుదైన జాతి..అయినా!



ఆలివ్ రిడ్లీ తాబేళ్లు అంతరించుకుపోతున్న అరుదైన తాబేళ్ల జాతిగా ప్రపంచ పర్యావరణ నిపుణులు ప్రకటించారు. ఆలివ్ రిడ్లీ తాబేళ్లు 7 రకాల జాతులు ఉన్నాయి. వీటిలో ఐదు రకాలు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఉన్నాయి. రెండు అడుగుల వెడల్పుతో ఉండే ఈ తాబేలు 50 కిలోల బరువు ఉంటుంది. ఇవి 20 వేల కిటోమీటర్లు దూరం ప్రయాణించి తీరానికి వస్తున్నాయి.గుడ్డు నుంచి పిల్లగా ఎదిగిన ఈ తాబేళ్లు ఎక్కడికి వెళ్లినా తిరిగి ఇక్కడికే వచ్చి గుడ్లు పెట్టడం వీటి ప్రత్యేకత. దేశంలో ఒడిశా తర్వాత ఈ తాబేళ్లు రాష్ట్రంలోకి అధికంగా రావడం, గుడ్లు పెట్టడం వెళ్లిపోవడం జరుగుతుంటుంది. బాపట్ల సూర్యలంక, గుంటూరు జిల్లా నిజాంపట్నం,నాగాయలంక జింకపాలెం, కృష్ణా జిల్లా కోడూరు, కాకినాడ తీరంలో ఉప్పాడ, కాకినాడ, హోప్‌ఐలాండ్, కోరంగి అభయారణ్యం తదితర సముద్రతీర ప్రాంతాలకు ఆలివ్ రిడ్లీ తాబేళ్లు ఎక్కువగా వస్తుంటాయి.



పిఠాపురంలో పశువుల సంత

# సంత నుంచి.. కబేళాకు..

» పిఠాపురం సంతలో పశువుల క్రయ, విక్రయాలు
» యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా
» హైకోర్టు ఆదేశాలు బేఖాతరు
» కనిపించని సీసీ కెమేరాలు
» ఎక్కడా కానరాని అధికారులు
» దారిపొడవునా కాసులు వెదజల్లుతూ తరలింపు

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం) పశువుల సంత నుంచే కబేళాకు పశువులు తరలిపోతున్నాయి. కళ్లెదుట పశు అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులకు పట్టడం లేదు. కబేళాల నిర్వాహకులు దారి పొడవునా కాసులు వెదజల్లుతూ దర్జాగా తమ గమ్యాన్ని చేరుకుంటున్నారు. పశువుల అక్రమ రవాణా నిరోధంపై హైకోర్టు ఆదేశాలు బేఖాతరవుతున్నాయి. సంతల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి క్రయ, విక్రయాలు, రవాణాపై నిఘా ఉంచడంతోపాటు అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. పశువుల తరలించే వాహనాలు తమ మార్గంలో వెళ్తుంటే కాసుల పంట పండుతుండడంతో పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.



వ్యాన్‌లో కబేళాకు తరలిపోతున్న పశువులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ప్రత్యేక స్థానం ఉన్న పిఠాపురం పశువుల సంత ప్రతి శనివారం జరుగుతుంది. ఇక్కడకు పిఠాపురం పరిసర ప్రాంతాలతోపాటు కాకినాడ జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి రైతులు పశువులను తీసుకుని వస్తూ ఉంటారు. ప్రతి వారం ఐదు నుంచి ఆరువేలకు పైగా పశువుల క్రయ విక్రయాలు జరుగుతాయి. ఇటీవల కాలంలో కబేళాల నిర్వాహకులు జరిపే కొనుగోళ్లే అధికమయ్యాయి. రైతులతో పోల్చుకుంటే వీరు పశువులకు చెల్లించే మొత్తం 100శాతం వరకూ అధికంగా ఉండడంతో పశువులను విక్రయించేందుకు తీసుకువచ్చే వారు వీరికి అమ్మేందుకే ఆసక్తి చూపిస్తున్నారు.

### ఇతర ప్రాంతాల వారిదే హవా

పిఠాపురం పశువుల సంత నుంచి జరిగే పశువుల రవాణాపై కొంతకాలంగా నిఘా కొరవడింది. దీంతో హైదరాబాద్, మెదక్, మహారాష్ట్ర, ఒడిశా తదితర ప్రాంతాల్లోని కబేళా నిర్వాహకులు ఇక్కడకు వచ్చి దళారుల ద్వారా కొనుగోళ్లు చేస్తున్నారు. కబేళాకు విక్రయాలు జరిపే బడా వ్యాపారులు తమ అవసరాలకు ముందుగానే ఇక్కడ దళారులు, బేరగాళ్లకు వివరిస్తారు. దానికి అనుగుణంగా శనివారం జరిగే పశువుల సంతలో కొనుగోళ్లు జరుగుతున్నాయి. రైతులు అడిగినంత ఇచ్చి పశువులు కొనుగోలు చేస్తున్నారు. వీరితోపాటు కొందరు స్థానికంగా అక్రమ కబేళాలు నిర్వహించే వారు కూడా ఇక్కడకు వచ్చి తమకు అవసరమైన పశువులను కొంటున్నారు.

### దర్జాగా తరలింపు

కొంతకాలం క్రితం వరకూ పిఠాపురం సంత నుంచి పశువులు తరలించాలంటే భయపడేవారు. జంతుహింస నివారణా సంఘాలు, హిందూ సంఘాలు కబేళాకు పశువుల అక్రమ రవాణాను అడ్డుకుని పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేసేవారు. ఇటీవలకాలంలో వారు ఇటువైపు చూడడం మానేశారు. దీంతో సంతలోనే మినీవ్యాన్లు, లారీలు, లోడు ఆటోల్లో పశువులను ఎక్కించి తరలిస్తున్నారు. ఈ వాహనాలన్నింటినీ వారానికి ఒక ప్రాంతంలో ఆపి అక్కడినుంచి కంటెయినర్లు, పెద్దలారీల్లో కుక్కి కబేళాకు పంపుతున్నారు. గతంలో మాదిరిగానే వీరు కొన్న పశువులు, దూడలకు మార్కింగ్ వేస్తున్నారు. ప్రతివారం కనీసం వెయ్యి నుంచి 1500 పశువులను కబేళాలకు తరలిస్తున్నట్లు అంచనా. ఇక్కడినుంచి పశువులను తరలిస్తున్న దారిమార్గంలో ఆపిన చోట కాసులు వెదజల్లుతూ గమ్యానికి చేరుకుంటున్నారు.

### హైకోర్టు ఆదేశాల అమలు ఎక్కడ

పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంత జరిగే ప్రాంతాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి పశుసంవర్థక, మునిసిపల్, మార్కెటింగ్, రెవెన్యూ, పోలీసుశాఖలకు చెందిన అధికారులు, సిబ్బందితో కమిటీ ఏర్పాటు చేసి పశువుల క్రయ, విక్రయాలపై నిఘా ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలు కొంతకాలం పాటించిన అధికారులు తర్వాత వాటిని విస్మరించారు. పిఠాపురం పశువుల సంతలో మునిసిపాలిటీ తరఫున ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలు మాయమయ్యాయి. సంత జరిగే సమయంలో ఒక్క అధికారి కూడా అటువైపు చూడడం లేదు. దీంతో పశువుల అక్రమ రవాణాకు అడ్డూ అదుపులేకుండా పోయింది. సంత పరిసర ప్రాంతాల్లో ఉంటున్న పోలీసులు, ఇతర శాఖల సిబ్బంది వసూళ్ల పర్వానికి పాల్పడుతున్నారు.

### అడ్డుకట్ట వేయలేరా?

ఒకప్పుడు హైకోర్టు ఆదేశాలతో పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసిన అధికారులు ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అక్రమ రవాణాపై హడావుడి చేసిన వివిధ సంఘాలు ఇప్పుడు మిన్నకుండడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంత నుంచి పశువులు కబేళాకు భారీగా తరలివెళ్లిపోతున్నట్లు ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదులు అందాయి. గొల్లప్రోలు మండలం చెందుర్తి ప్రాంతంలో అక్రమ కబేళాలు నిర్వహిస్తున్నట్లు ఆయన దృష్టికి వచ్చాయి. అక్రమ కబేళాల వ్యవహారంపై డిప్యూటీ సీఎం పేషీ నుంచి వచ్చిన ఆదేశాలతో రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడ తనిఖీ నిర్వహించి ఏమీ లేదని తేల్చారు. అక్కడ అక్రమ కబేళాలు మాత్రం యథావిధిగా కొనసాగుతుండడం గమనార్హం. పిఠాపురం పశువుల సంతపై వారు దృష్టి పెట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పిఠాపురం పశువుల సంత నుంచి కబేళాలకు జరుగుతున్న అక్రమ పశువుల రవాణాపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

# నిలిచిన సీసీసీ సేవలు

» కాకినాడ స్మార్ట్ సిటీలో సేవలకు అంతరాయం
» పనిచేయని సీసీ కెమెరాలు
» నిర్వహణ లేక అస్తవ్యస్తం




కార్పొరేషన్(కాకినాడ), జనవరి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ స్మార్ట్ సిటీలో సీసీ కెమెరాలే పనిచేయడంలేదు. నగరానికి తలమానికంగా నిలిచిన సీసీసీ(కమాండ్ కంట్రోల్ సెంటర్) ప్రస్తుతం నిర్వహణ లేక నీరుగారుతోంది. గతం నుంచి ఈ బాధ్యతలు చేపట్టిన సెర్బిలైజ్ సంస్థ తప్పుకుంది. దీంతో నగరంలో ఇక్కడినుంచి అందించాల్సిన అనేక సేవలు నిలిచిపోయాయి.

ఒకప్పుడు ఇతర జిల్లాల స్మార్ట్ సిటీ చైర్మన్లు అధికారులు సైతం కాకినాడ సీసీసీని సందర్శించిన సందర్భాలు ఉన్నాయి. సెర్బిలైజ్ సంస్థకు రూ.19.50కోట్లు నిధులు బకాయిలు ఉండడంతో ఆ సంస్థ పక్కకు తప్పుకుంది. కొన్ని నెలలుగా సీసీసీ సేవలు కాకినాడ ప్రజలకు అందక నగరంలో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రధాన కూడల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతోపాటు టోల్‌ఫ్రీ, వైఫై, సీపీ కెమెరాలు పనిచేయకపోవడం, నెంబరు ప్లేట్లు, ఫేస్ రికగ్నేషన్, వీఎండీలు, పబ్లిక్ ఎనౌన్స్ మెంట్లు.. ఇలా సీసీసీ ఆధ్వర్యంలో 1440 ఎలిమేట్స్ పనిచేస్తుండగా ప్రస్తుతం ఈ సేవలన్నీ నిలిచిపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సెర్బిలైజ్ బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత కొత్త కంపెనీ టెండర్ నోటీసు ఇవ్వడంతోనే అధికారులు సరిపెట్టారు. కలెక్టర్, కమిషనర్ సైతం సీసీసీని పునరుద్ధరిస్తున్నామని ప్రకటించారు. కానీ కార్యరూపం దాల్చలేదు.

### రూ.100కోట్లు ప్రజాధనం నిరుపయోగంగా..

సీసీసీ ద్వారా స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్ హైస్కూల్, ప్రైమరీ స్కూళ్లలో సప్లై, డెలివరీ, ఇన్‌స్టాలేషన్, వర్చువల్ క్లాస్ రూమ్‌లు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ ల్యాబ్ సదుపాయాలతోపాటు 1440 ఎలిమేట్స్ పనిచేస్తుండగా ప్రస్తుతం అన్ని సేవలు నిలిచిపోయి నిరుపయోగంగా ఉంది. దీంతో స్మార్ట్ సిటీ నిధులు రూ.100 కోట్లతో నిర్మించిన సీసీసీ ఇలా నిరుపయోగంగా ఉండడంతో ప్రజాధనం నిరుపయోగం అవుతుందని ప్రజలు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## రేపు సామర్లకోటలో జాబ్‌మేళా

సామర్లకోట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సామర్లకోట టీటీడీసీ ఆవరణలో ఈ నెల 21న ఏపీఎస్ఎస్‌డీసీ,డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ కె.శ్రీరమణి తెలిపారు. డిగ్రీ విద్యార్హతలతో తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఇంటర్న్‌షిప్ 100 పోస్టుల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.టీమ్‌లీజ్ సంస్థకు చెందిన బ్రాంచి రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్స్, బ్రాంచి రిలేషన్‌షిప్ మేనేజర్లుగా ఏలేశ్వరం, జగ్గంపేట, ప్రత్తిపాడు ప్రాంతాల్లో పోస్టుల భర్తీకి డిగ్రీ విద్యార్హతలతో పురుష, మహిళా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ట్రైనీ కెమిస్టులుగా తుని కేంద్రంగా 50పోస్టుల భర్తీకి బీఎస్సీ, బీజెడ్‌సీ(డిప్లొమా కెమికల్) విద్యార్హతలతో పురుష అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు కో-ఆర్డినేటరు శివ 9440756250, డీపీవో శ్యామ్ 9949156583 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## చదవలేక..చచ్చిపోతున్నా! 6

ఎంతో మందికి ఊపిరిపోయాల్సిన చదువు అతని ఊపిరినే తీసింది.. మూడేళ్ల కష్టపడి ఎంబీబీఎస్ చదివాడు.. ఈ ఏడాదితో చదువు పూర్తయిపోతోంది.. కానీ అతనికి బ్యాక్‌లాగ్స్ ఉన్నాయి.. చివరి ఏడాది కావడంతో చదువు పూర్తయిపోవాల్సిందే.. లేకపోతే ఇటు ఇంట్లో.. అటు బంధువుల్లోనూ తలెత్తుకోలేడు..ఆ ఒత్తిడిలో ఎంతో మదనపడ్డాడు.. బయటపడలేకపోయాడు.. 8 నెలలుగా ఒక్కటే ఆలోచన.. ఆత్మహత్య చేసుకోవాలని.. కానీ మనసుకు అదుపు చేసుకుంటూ వచ్చాడు.. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాలేదు.. సంక్రాంతి సెలవులకు ఇంటికి రాలేదు.. పరీక్షలు ఉన్నాయని చెప్పాడు.. పండుగకు అందరూ వెళ్లిపోవడంతో హాస్టల్‌లో ఒక్కడే ఉన్నాడు.. ఆ ఆలోచన మరింత పెరిగింది.. డాడీ.. అమ్మా..తమ్ముడు నన్ను క్షమించండి అంటూ శనివారం ఒక లెటర్ రాసి.. ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. ఈ విషాద ఘటన విజయనగరం జిల్లా నెల్లిమర్ల మిమ్స్ మెడికల్ కాలేజీలో జరగ్గా.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో విషాదఛాయలు అలుముకున్నాయి.

# చిత్రం.. భళారే విచిత్రం

- అమలాపురంలో వైభవంగా ప్రారంభమైన అంతర్జాతీయ చిత్రకళా బ్రహ్మోత్సవం
- పాల్గొన్న ప్రముఖులు
- అవర్ ఆర్టిస్ట్స్ బోర్క్ టూ ఎక్సెల్ పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సత్యసాయి కల్యాణ మండపంలో కోనసీమ చిత్రకళాపరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి కొరసాల సీతారామస్వామి ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శన వైభవంగా జరిగింది. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ప్రదర్శనను ప్రారంభించారు. చిత్రకళా బ్రహ్మోత్సవం వేడుకలను చేనేత కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ వావిలాల సరళాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, రంకిరెడ్డి కాశి, సూదా గణపతి వంటెద్దు వెంకన్నాయుడు, కౌన్సిలర్ మట్టపర్తినాగేంద్ర పాల్గొన్నారు. బాపు చిత్రకళా ప్రదర్శనను గంధం కె.దుర్గాప్రసాద్, వడ్డాది పాపయ్య చిత్రకళా ప్రదర్శనను సుంకర చలపతిరావు, నీలి వెంకటరమణ చిత్రకళా ప్రదర్శనను అబ్దుల్ రజాహుస్సేన్, వీకేఆర్ శర్మ (డిజిటల్ రవి) ఛాయాచిత్ర ప్రదర్శనను కె.వెంకటభూపేష్ ప్రారంభించారు.


### బహుమతి ప్రదానోత్సవం..

చిత్రకళా బ్రహ్మోత్సవంలో భాగంగా విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 34వ వార్షికోత్సవానికి సంబంధించి కర్ణాటక రాష్ట్రం దార్వాడకు చెందిన దేవేందర్ ఎం.బాడీగర్‌కు భారత చిత్రకళారత్న గోల్డెన్ అవార్డుతో పాటు రూ.15వేలు నగదు బహుమతిని అందజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మెట్ల సత్య చేతులమీదుగా విజేతలకు అమరావతి చిత్రకళారత్న గోల్డెన్ అవార్డు, మెగా గోల్డెన్ పద్మ అవార్డ్స్, బెస్ట్ గోల్డెన్ పద్మఅవార్డు, సూపర్ గోల్డెన్ పద్మఅవార్డు, ఆర్ట్ లెజెంట్ గోల్డెన్ పద్మ అవార్డులను 391 మందికి అందజేశారు. 35వ వార్షిక ప్రదర్శనలో జార్కండ్‌కు చెందిన రాజీవ్ అగర్వాల్, వినుకొండకు చెందిన జస్టిస్ వజ్రగిరి, మహారాష్ట్రకు చెందిన హేమ కుట్నీకర్‌లకు భారత చిత్రకళారత్న బ్రహ్మోత్సవం అవార్డులతో పాటు ఒక్కొక్కరికీ రూ.5వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు. మొత్తంగా 675 మందికి అవార్డులు, రివార్డులు అందించారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్, డాక్టర్ బసవా వరహాలు, శిల్పి రాజ్‌కుమార్ వడయార్, డాక్టర్ గోదశి గంగరాజు, పోలిశెట్టి అనంతలక్ష్మి, నల్లా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు డాక్టర్ శ్యామ్‌జాదూగర్ బ్లైండ్ ఫోల్డ్ ఆర్ట్‌లో చేసిన మేజిక్ ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతినొందిన ప్రముఖ చిత్రకారుల చిత్రాలతో ముద్రించిన అవర్ ఆర్టిస్ట్స్ బోర్క్ టూ ఎక్సెల్ పుస్తకాన్ని ఎమ్మెల్యే ఐవీ ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు బత్తుల బాహూజీని కోనసీమ చిత్రకళాపరిషత్ తరపున చిత్రకళా సామ్రాట్ బిరుదుతో సత్కరించారు.


యుద్ధరంగంలో ధీరవనిత


ఊహ నిజమౌతున్న వేళ


ముద్దుకే ముద్దొచ్చే సింగారం


గరగ నృత్యం


వెలుగుల సిందూరి


తాతా మనుమడి ఆప్యాయత


భారత చిత్రకళారత్న అవార్డు గెలుచుకున్న విజేత బాడీగర్‌కు సన్మానం


శ్యామ్ జాదూగర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఐవీ

## విద్యార్థులు క్రీడల్లో పట్టు సాధించాలి

**'శ్రీప్రకాష్'లో మూడోరోజు జాతీయస్థాయి చెస్ పోటీలు**

పెద్దాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో మంచి పట్టు సాధించాలని ప్రముఖ వ్యాపారవేత్త కె.రాజేష్ అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో జరుగుతున్న జాతీయస్థాయి స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం మూడవ రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చెస్ క్రీడను ప్రోత్సహించేందుకు శ్రీప్రకాష్ పాఠశాల చేస్తున్న కృషి ఎంతో సంతోషదాయకమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేధాశక్తిని పెంపొందించడంలో చెస్‌కు మించిన క్రీడ మరొకటిలేదన్నారు. అలాగే ఇంటర్‌నేషనల్ అర్బిటర్ అరసును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన పోటీలను తిలకించారు. ఈకార్యక్రమంలో ఏపీ చెస్ అసోసియేషన్ చైర్మన్ కేవీవీ శర్మ, కార్యదర్శి ఏసీఏ అడుసుమిల్లి సురేష్, అనంతరామ్, పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ తదితరులు ఉన్నారు.


చెస్ పోటీలను తిలకిస్తున్న శ్రీప్రకాష్ పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

## భీష్మ ఏకాదశికి మెరుగ్గా ఏర్పాట్లు

- సుమారు 70వేల మంది వస్తారని, 12వేల వ్రతాలు జరుగుతాయని అంచనా
- తొక్కిసలాట జరగకుండా ఎక్కడికక్కడ భక్తులకు హోల్డింగ్ పాయింట్లు
- అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సమీక్ష


సిబ్బందితో సమీక్షిస్తున్న ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్

అన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి భీష్మ ఏకాదశి పర్వదినాన వేలాదిగా విచ్చేసే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆదివారం సిబ్బందితో సమీక్షించారు. ఈ ఏడాది కార్తీకమాస ఏర్పాట్లు బాగున్నాయని, వాటికంటే మెరుగ్గా ఉండాలని చైర్మన్ రోహిత్ సూచించారు. భీష్మ ఏకాదశి పర్వదినం ఫిబ్రవరి 8 కాగా 7వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు వ్రతం టిక్కెట్లు విక్రయించాలని, ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. సుమారు 70వేల మంది వరకు దర్శనానికి విచ్చేస్తారని, 12వేల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. రవాణా, తాగునీరు, పారిశుధ్యంపై దృష్టిసారించి ఎవరికీ ఇబ్బంది రాకుండా చూడాలని ఈవో ఆదేశించారు. అదనపు బస్సులు, టాటా మ్యాజిక్ వాహనాలను వినియోగించుకోవాలన్నారు. భక్తులకు వ్రతం, దర్శన సమయంలో హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటుచేసి రద్దీకి అనుగుణంగా వాటి నుంచి వ్రత మండపాలు, దర్శన క్యూలైన్లలోకి పంపించాలని సూచించారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రధానంగా ఆన్‌లైన్ పేమెంట్ కౌంటర్ల వద్ద సుశిక్షితులైన వారిని నియమించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు ఉచిత అన్నప్రసాద సమయంలో ఎక్కువసేపు వేచిఉండకుండా మొదటి అంతస్తులో అందించే ఏర్పాట్లపై చర్చించారు. అతి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని ఈవో చెప్పారు. సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని ని ర్ణయించారు. సమావేశంలో సహాయ కమిష నరు సీహెచ్ రామ్మోహనరావు, ఏఈవోలు కొండలరావు, ఎల్.శ్రీనివాస్, కృష్ణారావు, జగ్గారావు, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, నూకరత్నం, రాంబాబు, సూపరింటెండెంట్లు బలువు సత్యశ్రీనివాస్, ఐవీ రామారావు, కృష్ణప్రసాద్, అనకాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

## కన్నీరు పెట్టిస్తూ... సందేశాన్ని ఇస్తూ...

**భోగాపురంలో ఆలోచింపజేసిన నాటికలు**

పిఠాపురం/పిఠాపురం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీతో మంచి చెడు ఉంది. దానిని ఉపయోగించే తీరుపై అది ఆధారపడి ఉంటుంది. రైతుల జీవితాల్లో అప్పుల కష్టాలు భాగమయ్యాయి. అవి వారి ప్రాణాలను కూడా బలితీసుకుంటున్నాయి. ప్రభుత్వాలు సకాలంలో ఆదుకుంటే వారి బతుకులు బాగవుతాయి అంటూ కన్నీరు పెట్టిస్తూ సందేశాత్మకంగా సాగాయి కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పోటీల్లో మూడో రోజు ప్రదర్శనలు. హైదరాబాద్‌కు చెందిన యువభేరి ఆర్ట్స్ క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన నా శత్రువు నాటిక టెక్నాలజీ మన జీవితాల్లో తెచ్చిన మార్పులను సవివరంగా చాటిచెప్పింది. ఈ రోజుల్లో ఎవరికి వారు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లతో బిజీబిజీగా గడుపుతూ బంధాలు, అనుబంధాలకు దూరమై ఒంటరి వారైపోతున్నారు. టెక్నాలజీని అవసరానికి మాత్రమే వాడితే దానికి మించిన మిత్రుడు లేడు. అలా కాకుండా ఏదో ఒకటి చేస్తూ అవసరం లేకున్నా దానిపైనే గడుపుతూ ఉంటే జీవితాలు చిన్నాభిన్నమవుతాయని ఈ నాటిక ద్వారా వివరించారు. ఈ నాటికను అక్కల తామేశ్వరయ్య రచించగా, వడ్డాది సత్యనారాయణ దర్శకత్వం వహించారు.


చీకటి బతుకులు నాటికలోని దృశ్యం


నా శత్రువు నాటికలోని ఓ సన్నివేశం

### రైతుల జీవితాల్లో...

రైతుల జీవితాల్లో సుఖదుఃఖాలు కలసిమెలసి ఉంటాయి. పంట పెట్టుబడులు కోసం రైతులు చేసే అప్పులే గుదిబండగా మారి వారి ప్రాణాలు తీసుకుంటున్నాయని కర్నాటక రాష్ట్రంలోని బళ్లారికి చెందిన జీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కళాకారులు ప్రదర్శించిన చీకటి బతుకులు నాటిక ద్వారా తెలియజెప్పారు. ఈ నాటిక ఆద్యంతం ప్రేక్షకుల కంట కన్నీరు పెట్టించింది. తమ జీవితాల మాదిరిగా ఉన్న ఈ నాటిక అందరిని ఆలోచింప చేసింది. జీఆర్ వెంకటేశులు ఈ నాటికను రచించి దర్శకత్వం వహించారు.

### ఈస్టిండియా పాలనలో..

కలకత్తా కేంద్రంగా ఈస్టిండియా పరిపాలన సమయంలో 1840లో జరిగిన సంఘటన ఆధారంగా హైదరాబాదులోని తెల్లాపూర్ మహతి క్రియేషన్స్ కళాకారులు ఉక్కు సంకెళ్లు నాటికను ప్రదర్శించారు. ఉక్కు సంకల్పం ఉంటే ఎవరైన దిగిరావాల్సిందే అని ఈ నాటిక ద్వారా చాటి చెప్పారు. ఈ నాటికను సింహప్రసాద్ రచించగా ఉప్పలూరి సుబ్బరాయశర్మ దర్శకత్వం వహించారు.

### జీవితకాల సాధన పురస్కారం అందజేత

ప్రముఖ రచయిత, నటుడు, నంది అవార్డు గ్రహీత తాళాబత్తుల వెంకటేశ్వరరావును అడపా అచ్చియమ్మ, మాణిక్యం స్మారక జీవితకాల సాధన పురస్కారంతో సత్కరించి అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మవ్యాప్తికి గాడ్ కృషి అభినందనీయం

**ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు**

రాయవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మవ్యాప్తికి వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ చేస్తున్న కృషి అభినందనీయమని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు అన్నారు. ఆదివారం గాడ్ 89వ జన్మదిన వేడుకలు పీఠం వద్ద ఉన్న సీతా సదనంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు యర్రాప్రగడ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు కృషి చేయడం సంతోషకరమని, హిందూ ధర్మవ్యాప్తికి మరింత కృషిచెయ్యాలని పిలుపునిచ్చారు. గాడ్ ఆధ్యాత్మిక సేవల ద్వారా తాను పుట్టిన ప్రాంతానికే కాకుండా తెలుగురాష్ట్రాల్లో పేరు పొందారన్నారు. భక్తులనుద్దేశించి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ప్రతిమనిషి దైవరాధన చేయడం ద్వారానే ఉత్తమ జీవనం సాగించడం సాధ్యమౌతుందన్నారు. సహస్రావధాని గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ మనిషి కష్టాలకు కుంగిపోకుండా దైవం మీద నమ్మకంతో ముందుకు సాగాలని భగవంతుడ్ని నమ్ముకున్నవారికి ఎటువంటి కష్టాలు దరిచేరవన్నారు. ఈసందర్భంగా కోట శ్రీను దత్త రచించిన గాడ్ వైభవం పుస్తకాన్ని, పోస్టల్‌శాఖ ద్వారా తయారు చేసిన గాడ్ చిత్రంతో ఉన్న 5రూపాయిల స్టాంప్‌ను గరికపాటి, చిలకపాటి విజయ రాఘవాచార్యులు, తుమ్మిడి రామ్ కుమార్, ప్రసార భారతి విశ్రాంత డైరెక్టర్ ఆర్.అనంత పద్మనాభరావు ఆవిష్కరించారు. శ్రీరంగం దేవస్థానం ఆచార్యులు పరాశర లక్ష్మి నరసింహ భట్టర్ గాడ్‌కు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, కోట సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో కవులు సాహిత్తివేత్తలను గాడ్ సమక్షంలో ఘనంగా సత్కరించారు. హైదరాబాదుకు చెందిన యువకుడు వారణాసి రాఘవను పీఠం ఆస్థాన విద్యాన్‌గా నియమించడం తో పాటు సంగీత విద్యన్ మణి బిరుదుతో సత్కరించారు.



గాడ్ వైభవం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గరికపాటి, వక్తలు.. మాట్లాడుతున్న దుర్గాప్రసాదరావు

### గాడ్ ఆశీస్సులు పొందిన ప్రముఖులు

గాడ్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి గాడ్‌ను సత్కరించి ఆశీస్సులు పొందారు. డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, డాక్టర్ విశ్వనాధ గోపాలకృష్ణ, డాక్టర్ గన్ని భాస్కరరావు, తుమ్మిడి రామ్‌కుమార్, మేడసాని మోహన్, అన్నవరం దేవస్థానం ఈవో డి.సుబ్బారావు, గొర్తి సుబ్రహ్మణ్య శాస్త్రి నృత్య కళాకారుడు సప్పా దుర్గా ప్రసాద్ గాడ్ ఆశీస్సులు పొందారు.

## లిఫ్ట్ ఇస్తానని బంగారం దోచుకెళ్లాడు

**వృద్ధురాలి మెడలో ఆభరణాల చోరీ**


అనపర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బస్సు దిగి నడిచి వెడుతున్న వృద్ధ దంపతులను లిఫ్ట్ ఇస్తానని నమ్మించి వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు గుర్తు తెలియని దుండగుడు దొంగిలించిన సంఘటన అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం కొప్పవరం రోడ్డులో శనివారం జరిగింది. ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం. అనపర్తి మండలం కొప్పవరానికి చెందిన వృద్ధ దంపతులు సబ్బెళ్ల వెంకటరెడ్డి, వెంకయ్యమ్మ కాకినాడలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో లక్ష్మీనరసాపురం వంతెన వద్ద బస్సు దిగి కొప్పవరానికి నడిచి పయనమయ్యారు. కొంతదూరం వెళ్లిన తరువాత మోటారుసైకిల్‌పై వచ్చిన దుండగుడు వృద్ధురాలికి లిఫ్ట్ ఇస్తానని నమ్మించి ఆమెను మోటార్ సైకిల్‌పై కొంతదూరం తీసుకువెళ్లాడు. అక్కడ నిర్మానుష్య ప్రదేశంలో బండి ఆపి ఆమె మెడలో ఉన్న మంగళ సూత్రాలతో ఉన్న రెండు పేటల బంగారు గొలుసు, నల్లపూసల దండతో సహా 8 తులాల బంగారంతో ఉడాయించాడు. వెంకటరెడ్డి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## నాన్న, అమ్మా క్షమించండి!

**సూసైడ్ నోట్ రాసి వైద్య విద్యార్థి ఆత్మహత్య**

**స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు**

నెల్లిమర్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మిమ్స్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం విద్యార్థి ఆత్కూరి సాయిమణిదీప్ (24) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తను ఉంటున్న హాస్టల్ గదిలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ సూసైడ్ నోట్ రాసి అందులో డాడీ, అమ్మా, తమ్ముడూ నన్ను క్షమించండి అంటూ కోరాడు. నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన సాయిమణిదీప్ నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్ గదిలో మణిదీప్‌తో ఉంటున్న తోటి విద్యార్థులు పండుగకు స్వగ్రామాలకు వెళ్లారు. ఇంకా రాలేదు. శనివారం రాత్రి 7 గంటల వరకు పక్క రూమ్ విద్యార్థులతో మాట్లాడి తలుపులు వేసుకున్న మణిదీప్ ఆదివారం ఉదయం 10 గంటల వరకు బయట కురాలేదు. పక్క రూమ్ వి ద్యార్థులకు సందేహం కలిగి కిటికీలో నుంచి చూశారు. మంచంపై లేకపోవడంతో గదిలోకి వెళ్లి పరిశీలించారు. బాత్‌రూమ్‌లో అచేతనంగా పడి ఉన్నట్లు గుర్తించారు. విషయం యాజమాన్యానికి తెలియజేయడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడున్న ఆధారాల ఆధారంగా గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మణిదీప్‌కు బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్స్ ఉండి పోయాయి. ఆ పరీక్షలు రాసేందుకు పండుగకు ఇంటికి వెళ్లలేదు. హాస్టల్‌లోనే ఉండి పోయాడు. ఓ పక్క ఏకాంతం, మరో పక్క మానసిక సంఘర్షణ కలిసి ఆత్మహత్యకు పురిగొల్పి ఉండవచ్చు. కళాశాల యాజమాన్యం, పోలీసులు ఇచ్చిన సమాచారంతో తల్లిదండ్రులు ఆత్కూరి శిరీష, ఆత్కూరి రామారావు, బంధువులు ఆదివారం సాయంత్రానికి నెల్లిమర్ల చేరుకుని భోరున విలపించారు. తండ్రి రామారావు నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలో వికాస్ విద్యాసంస్థలో డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా మణిదీప్ పెద్ద కుమారుడు. చిన్న కుమారుడు గౌరీనంద్ బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు.


సాయి మణిదీప్(ఫైల్)

### కన్నీరు తెప్పిస్తున్న సూసైడ్ నోట్

సాయి మణిదీప్ మృతదేహం వద్ద పోలీసులకు లభించిన సూసైడ్ నోట్‌లోని అంశాలు కన్నీరు తెప్పిస్తున్నాయి. "డాడీ, అమ్మా, నన్ను క్షమించండి. గత పదేళ్లుగా మిమ్మల్ని చాలా చాలా కష్టపెట్టాను. బాధ పెట్టాను. నా వల్లే ఇంట్లో సంతోషం, ప్రశాంతత లేదు. నా వల్లే మీ ఆరోగ్యం కూడా బాగుండట్లేదు. ఎంత కష్టపడి చదువుదాం అన్నా చదవలేకపోతున్నా. రకరకాల ఆలోచనలు వస్తున్నాయి. గత 8-9 నెలల నుంచి సూసైడ్ ఆలోచనలు తినేస్తున్నాయి. కానీ ఎవరికీ చెప్పలేను. నా వల్ల తమ్ముడు కూడా చాలా బాధపడుతున్నాడు. ఇంట్లో పరిస్థితుల వల్ల నాకు నేనే పిచ్చోడిలా అనిపిస్తున్నా. అమ్మా నా కోసం ఎంతో చేశారు. నేను మాత్రం మిమ్మల్ని బాధలు పెడుతూనే ఉన్నా. మీ నిద్ర, ఆరోగ్యం అన్నీ నా వల్లే పోతున్నాయి. బతకాలి అంటే భయమేస్తోందమ్మా. నా గురించి కాదు, ఇంకా ఎంత కాలం మిమ్మల్ని బాధ పెడతా అని, మీరు ఆనందంగా ఉండటమే నాకు కావాలి. డాడీ, అమ్మా నన్ను క్షమించండి" అని సాయి మణిదీప్ ఆ లేఖలో రాశాడు.

### మిమ్స్‌లో విషాదం

మిమ్స్‌లో వైద్య విద్యార్థి సాయిమణిదీప్ ఆత్మహత్య ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. యాజమాన్యం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. తోటి విద్యార్థులు సైతం కన్నీరుమున్నీరయ్యారు. మణిదీప్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అయ్యో.. ఐదేళ్ల పాపకు ఎంత కష్టం

- విద్యుత్ షాక్‌తో చేయిని కోల్పోయిన కూతురు
- తల్లికి తీవ్రగాయం

అల్లవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి కొత్తకాలనీలో తల్లి కేతా రమాదేవి డాబాపై దుస్తులు ఆరవేస్తుండగా ఆడుకునేందుకు డాబా పైకి వచ్చిన ఐదేళ్ల కూతురు కేతా లాస్యమాధురి విద్యుత్ తీగ వల్ల షాక్‌కు గురై శనివారం తీవ్రంగా గాయాలపాలైంది. సంక్రాంతి సెలవులకు కాకినాడ నుంచి గోడి వచ్చిన లాస్యమాధురి డాబాపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ విద్యుత్ ప్రమాదానికి గురైన సమయంలో కుమార్తెను రక్షించబోయిన తల్లి రమాదేవి కూడా తీవ్రంగా గాయపడింది. తల్లీకూతుళ్లను కాకినాడ జీజీహెచ్‌కు తరలించి అత్యవసర వైద్యసేవలు అందించారు. తీవ్రంగా గాయపడిన లాస్యమాధురి కుడి చేతిని శస్త్ర చికిత్స చేసి కాకినాడ జీజీహెచ్ వైద్యులు తొలగించారు. తమ ఇంటిపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి, తొలగించాలని విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వల్లే చిన్నారి లాస్యమాధురి చేతిని కోల్పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తల్లీకూతుళ్ల విద్యుత్ ప్రమాదానికి గురైన సంఘటన గోడి గ్రామాన్ని కుదిపివేసింది. నివాస ప్రాంతాల్లో ప్రమాదకర విద్యుత్ తీగలను తొలగించి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఈ సంఘటనపై అల్లవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నామన్నారు.


చేయిని కోల్పోయిన కేతా లాస్యమాధురి


గాయపడ్డ రమాదేవి

## బంధువుల ఇంట ఫంక్షన్‌కు బయల్దేరి..

**ట్యాంకర్ లారీ ఢీకొనడంతో యువకుడు మృతి**

ప్రత్తిపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం కథనం మేరకు ఏలేశ్వరం మండలం పేరవరం గ్రామానికి చెందిన రాజమాణి శివ(22)తునిలో బంధువుల ఇంట జరిగే ఫంక్షన్‌కు బయల్దేరగా అతడి వెనుక బావ గొంప భాను, భాను తల్లి నారాయణమ్మ రెండు వేర్వేరు మోటార్ బైక్‌లపై బయల్దేరారు. ధర్మవరం పెట్రోల్‌బంకు సమీపంలో హోండా ప్యాషన్‌ప్లస్ బైక్‌పై వెళ్తున్న రాజమాణి శివను వెనుక నుంచి ట్యాంకర్ లారీ పక్కనే మరో లారీ ఓవర్ టేక్ చేస్తూ శివ బైక్‌ను ఢీ కొంది. దీంతో అక్కడికక్కడే శివ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు...

ఏలేశ్వరం మండలం పేరవరంలో వ్యవసాయ కూలి పనులు, మేకలు, గొర్రెలు పెంపకం పనులు చేసుకునే రాజమాణి శ్రీను, రమణమ్మలకు శివ, మరో అబ్బాయి సంతానం. కూలిపనులు చేస్తూ కుటుంబ పోషణలో చేతికి అందివచ్చిన శివ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడటం పట్ల కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. సంఘటనా స్థలం వద్ద మృతుడి బావ, అత్త నారాయణమ్మ షాక్‌తో విలవిల్లాడారు.


శివ మృతదేహం వద్ద విలపిస్తున్న అత్త నారాయణమ్మ

### నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు కాకినాడ కమిషనర్ భావన తెలిపారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం 9.30గంటల నుంచి డయల్ యువర్ కమిషనర్, 10 నుంచి 1 వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ఉంటుందన్నారు.

# పూర్వ విద్యార్థుల కలయికలు



తాటిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



కాకినాడలో కలుసుకున్న ఎంఎస్ఎన్ చార్టీస్ పూర్వ విద్యార్థులు

గొల్లప్రోలు రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అపూర్వ కలయిక పేరిట కలుసుకున్నారు. తరగతి గదుల్లో చేసిన అల్లరి, చిలిపి పనులు, ఉపాధ్యాయుల మందలింపులు, చదువులో పోటీ ఇలా పలు అంశాలను గుర్తుకు తెచ్చుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరదాగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు దడాల వాడపల్లి, ఆకొండి లక్ష్మణమూర్తి, గోకరకొండ నాగేశ్వరరావు, పద్మజలను సత్కరించారు. ఏటా కలుసుకోవాలని తీర్మానించుకుని భారమెక్కిన హృదయాలతో పరస్పరం వీడ్కోలు చెప్పుకున్నారు.

**కాకినాడ సిటీ:** కాకినాడ-జగన్నాథపురంలోని మల్లాడి సత్యలింగం నాయకర్ చార్టీస్ 1976-77 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సందడిగా సాగింది. పాఠశాలలో ఆదివారం ఏర్పాటు కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ పాఠశాలలో చదువుకుని పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన బి.ప్రదీప్తి, కె.విజయదుర్గకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎంఎస్ సుబ్రహ్మణ్యం రూ.5వేల చొప్పున నగదు చెక్కులు అందజేశారు. అంతర్జాతీయ పాటల పోటీల్లో పాల్గొని స్వర్ణపతకం సాధించిన తటవర్తి సూర్యప్రభ, ఇటీవల పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సత్కరించారు. గ్రూప్ అడ్మిన్ ఆదం గోవిందురాజులు, ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు గుత్తుల రమణ, గరగ వీరభద్రరావు, శీరం నాగేశ్వరరావు, కె.భాస్కరరావు, మంగపతి, ఖాజీ మొహిద్దీన్, నమ్మిరాజు బాబు, వొమ్మి మధుసూధనరావు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

గొల్లప్రోలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు సైనికుల్లా పాటుపడదామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గొల్లప్రోలు పట్టణ శివారులోని మామిడితోటల్లో ఆదివారం స్వచ్ఛగొల్లప్రోలు, వివేకానంద జ్ఞానమందిరం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సైనికులు, వివిధ రంగాల ప్రముఖులు మాట్లాడుతూ స్వచ్ఛ గొల్లప్రోలు, వివేకానంద జ్ఞానమందిరం ద్వారా కొన్నేళ్లుగా గొల్లప్రోలు పరిశుభ్రతకు చేపట్టిన చర్యలు, మొక్కలు పెంపకం, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో పోషిస్తున్న పాత్రను వివరించారు. యోగాలో గౌరవ డాక్టరేట్ పొందిన యోగా గురువు జ్యోతుల నాగేశ్వరరావును సత్కరించారు. వివేకానంద జ్ఞానమందిరం వ్యవస్థాపకుడు పడాల కన్నారావు, విశ్రాంత ఎంఈవో దుర్గాప్రసాద్, మొగలి అప్పలరాజు, మాజీ ఎంపీపీ వర్ధనపు వీర్రాజు, స్వచ్ఛ గొల్లప్రోలు ప్రతినిధులు కొశిరెడ్డి రాజా, కొమ్ము సత్యనారాయణ, చోడపునీడి పుల్లపురాజు, కొమ్ము సత్యనారాయణ పాల్గొన్నారు.



గొల్లప్రోలులో జరిగిన ఆత్మీయ సమావేశం

# ఆదాయ వేటలో..

**కాకినాడ నగరపాలక సంస్థ**

**సెల్‌ఫోన్లకు సందేశాలు,**

**మైక్, కరపత్రాల ద్వారా ప్రచారం**

**స్పెషల్ డ్రైవ్‌పై దృష్టిసారించిన కమిషనర్**



కాకినాడ కార్పొరేషన్ కార్యాలయం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 19(ఆంధ్రజ్యోతి): జియో ట్యాగింగ్, ఎన్‌పీసీఐ, అపార్, ఎంఎస్ఎంఏ సర్వే కార్యక్రమాలతో నగరపాలక సంస్థ పరిధిలో ఆదాయ వసూళ్ల(ట్యాక్స్ కలెక్షన్)పై తీవ్ర ప్రభావం పడింది. పారిశుధ్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు, ఉద్యోగులు రెగ్యులర్ విధుల బదులుగా సర్వే పనులకు బృందాలుగా పనిచేశారు. ఫలితంగా పాలక సంస్థకు రావాల్సిన ఆదాయ వసూళ్లు గణనీయంగా తగ్గిపోయింది. నవంబరు నుంచి ప్రారంభం కావాల్సిన ఆదాయ వసూళ్ల స్పెషల్ డ్రైవ్ సిబ్బంది కొరత కారణంగా జాప్యం జరిగింది. దీంతో కమిషనర్ భావన ఆదాయ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టారు.

**నివాస గృహాల ఆదాయపన్ను**

నూరుశాతం ఆదాయ వసూళ్ల లక్ష్యంతో కేఎంసీలో 81660 నివాస, వ్యాపార భవనాలకుగాను రూ.52కోట్లు పన్ను వసూలు కావాల్సి ఉంది. దీనికిగాను ఇప్పటివరకు రూ.34.50కోట్లు వసూలైంది. మరో రూ.17కోట్లు వసూలు కావాల్సి ఉంది. దీనిలో రూ.5.77కోట్లు మొండి బకాయిలు ఉన్నాయి.

**కుళాయి పన్ను**

కుళాయి కనెక్షన్లు 9696 ఉండగా రూ.9.97కోట్లకుగాను రూ.2.40కోట్లు వసూలు కాగా రూ.7.75కోట్లు వసూలు కావాల్సి ఉంది. దీనిలో రూ.4.37కోట్లు మొండి బకాయిలే.

**మీటర్ ట్యాప్ కనెక్షన్ పన్ను**

మీటర్ ట్యాప్ కనెక్షన్లు 2393 ఉండగా రూ.2.54కోట్లకు రూ.65లక్షలు మాత్రమే వసూలైంది. రూ.1.89కోట్లు వసూలు కావాల్సి ఉంది.

**ఖాళీ స్థలాల పన్ను**

వీఎల్‌టీ సర్వే ప్రకారం నగరపాలక పరిధిలో 1336 ఖాళీ స్థలాలను అధికారులు గుర్తించారు. వీటికిగాను రూ.5.36కోట్లు పన్ను వసూలు కావాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.2.15కోట్లు వసూలైంది. రూ.3.21కోట్లు వసూలు కావాల్సి ఉంది.

**లక్ష్య సాధనలో అధికారులు**

లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు గతంలో పనిచేసిన బిల్ కలెక్టర్లతోపాటుగా నూతన వార్డు ఆఫీసర్లను కమిషనర్ రంగంలోకి దింపారు.

**రెడ్ నోటీసుల జారీతో**

13మంది బిల్ కలెక్టర్లు, ఏడుగురు రెవెన్యూ అధికారులు గతంలో బాధ్యతలు నిర్వహించారు. 87మంది సచివాలయం రెవెన్యూ అడ్మిన్లు బాధ్యతలు స్వీకరించారు. ప్రతి బృందం రెడ్ నోటీసులు జారీ చేసి వారి నుంచి ట్యాక్స్ కలెక్షన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చి నాటికి పూర్తిస్థాయిలో పన్నులు వసూళ్లు చేయాలని కమిషనర్ ఆదేశాలిచ్చారు. ట్యాక్స్ చెల్లించాల్సిన వారి సెల్‌ఫోన్లకు సమాచారం పంపుతున్నారు. మైక్‌ల ద్వారా ప్రచారం ప్రారంభించారు. ఉదయం 8గంటలకే బృందాలను సర్వేకు పంపి ఆదాయ వసూళ్లపై దృష్టిసారించారు.

# సంక్రాంతి గానసభలు ప్రారంభం



బహుమతి ప్రదానం చేస్తున్న వీసీ

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 19(ఆంధ్రజ్యోతి): సంగీత విద్వత్సభ కాకినాడ వారి ఆధ్వర్యంలో సూర్యకళామందిరంలో సంక్రాంతి గానసభల పది రోజుల కార్యక్రమాల్లో జేఎన్టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేయగా మొదటిరోజు కార్యక్రమంగా విద్యా కల్యాణరామన్ చెన్నై వారి గాత్ర కచేరి అద్భుతంగా జరిగింది. షణ్ముఖప్రియ రాగంలో మరివేరే, మోహనరాగంలో నను పాలింప, శంకరాభరణంలే సరోజదళ నేత్రి మొదలైన కీర్తనలు గానం చేసి మైమరపించారు. వీరికి వయోలిన్‌పై బంబే మాధవన్, చెన్నై, మృదంగంపై ఎం.శ్రీధర్ చక్కని సహకారాన్ని అందించారు. మొదటిరోజు ఉదయం రెండు తెలుగు రాష్ట్రాల వారికి కర్ణాటక సంగీత గాత్ర, వాయిద్య పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలు గాత్ర విభాగంలో మొదటి బహుమతి మాస్టర్ వి.సంతోష్ తమన్, రెండో బహుమతి మాస్టర్ స్మరణ్, మూడో బహుమతి కె.భార్గవ్, వాయిద్య విభాగంలో మొదటి బహుమతి వి.సంతోష్‌తమన్, రెండో బహుమతి వైదీక్షిత్ మురారి, మూడో బహుమతి డి.సాయిసర్వాణి, వీణ సీనియర్ విభాగంలో మొదటి బహుమతి ఆర్.దేవిశ్రీప్రియ, రెండో బహుమతి జి.రాజ్‌కౌశల్, సంగీత విద్వాంసులు డి.నగేష్ బాబు, రెహమాన్ న్యాయమూర్తులుగా వ్యవహరించారు. వీరికి జవహర్‌లాల్ విశ్వవిద్యాలయం వీసీ మురళీకృష్ణ బహుమతి ప్రదానం చేశారు.

# మున్సిపాలిటీకి సర్వే రికార్డులు అప్పగింత

**ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన**

పెద్దాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాల మధ్య సర్వే రికార్డుల కోసం గత కొన్ని నెలలుగా జరుగుతున్న కోల్డ్ వార్ ముగిసింది. ఈనెల 7వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో సర్వే రికార్డుల కోసం కోల్డ్ వార్ పేరుతో ప్రచురితమైన కథనానికి తహశీల్దార్ కార్యాలయ అధికారులు స్పందించారు. మున్సిపల్ సర్వేయర్ సీహెచ్ నిరంజన్‌రావుకు బ్లాక్ మ్యాప్స్, రెవెన్యూ వార్డ్ మ్యాప్స్, టీఎస్ఆర్ రిజిస్టర్లు తదితర రికార్డులను తహశీల్దార్ ఆదేశాలతో మండల సర్వేయర్ సామోర్ మున్సిపల్ సర్వే రికార్డులను అందజేశారు.



సర్వే రికార్డులను పరిచూసుకుంటున్న మున్సిపల్ సర్వేయర్

## ప్రశాంతంగా రేషన్ డీలర్ల రాత పరీక్ష



పరీక్షను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) పెద్దాపురం డివిజన్ పరిధిలో ఉన్న రేషన్ దుకాణాల్లో శాశ్వత ప్రాతిపదికన రేషన్ డీలర్ల నియామకానికి స్థానిక మహారాణీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతగా జరిగింది. పరీక్ష తీరును ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి పరిశీలించారు. 11 మండలాల నుంచి 197 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 125 మంది రాత పరీక్షకు అర్హులుగా ఎంపికచేశారు. వారిలో 119 మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్షా కేంద్రానికి సూపర్‌వైజర్‌గా ఆర్డీవో కార్యాలయ ఏవో మాధవరావు, డీటీ భానుకుమార్ వ్యవహరించారు.

## నేటి నుంచి ఉరుస్ షరీఫ్ గంధోత్సవం



ఉత్సవానికి ముస్తాబైన దర్గా

పెద్దాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఉన్న హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా, హజరత్‌షా రహమతుల్లా వార్ల ఉరుస్ షరీఫ్ గంధోత్సవం ఈనెల 20 తేదీ నుంచి 22వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మమద్ లాయక్ ఆలీ తెలిపారు. 350 ఏళ్ల పైబడిన ఘనచరిత్ర కలిగిన ఈగంధోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి కులమతాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో వేలాదిగా ప్రజలు తరలిరానున్నారు. వారికి ఏ ఇబ్బందులు రాకుండా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఈ గంధోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం

సామర్లకోట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో మున్సిపల్ ఆధ్వర్యంలో టీపీఎస్ నిధులు రూ.80 లక్షల వ్యయంతో పలు వార్డుల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతులమీదుగా శంకుస్థాపన పూజలు సోమవారం ఉదయం నిర్వహించనున్నట్టు కమిషనర్ శ్రీవిద్య తెలిపారు.

# అమిత్‌షా గో బ్యాక్ అంటూ వామపక్షాల నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

కాకినాడ సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌పట్ల అనుచితంగా, అవమానకరంగా మాట్లాడిన అమిత్‌షా మన రాష్ట్రంలోనే కాదు దేశంలో ఎక్కడా పర్యటించే నైతిక హక్కు లేదని వామపక్షాల నాయకులు విమర్శించారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటన నేపథ్యంలో అమిత్‌షా గోబ్యాక్ అంటూ వామపక్షాల రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఇంద్రపాలెం వంతెన అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. వామపక్షాల నాయకులు దువ్వా శేషబాబ్జి, జె.వెంకటేశ్వర్లు, గొడుగు సత్యనారాయణ మాట్లాడుతూ అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలకు ప్రధాని మోదీ సైతం బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుబ్బల ఆదినారాయణ, నరసింహరావు, కె.సత్తిరాజు, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

## శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**మత్స్యకార నాయకుడు తాతారావు**



పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ అందజేసిన దృశ్యం

కాకినాడ సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, శ్రద్ధగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మత్స్యకార నాయకుడు పినపోతు తాతారావు అన్నారు. ఏటిమొగ యూత్ డెవలపర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏటిమొగ పార్కు ఆవరణలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మత్స్యకార నాయకుడు పినపోతు తాతారావు, విశిష్ట అతిథులుగా ఏఎస్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ చింతా నారాయణమూర్తిరాజు, అగ్నికుల క్షత్రియ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అద్దంకి వెంకన్నబాబు, ఉపాధ్యాయుడు పినపోతు రామకృష్ణ, ఇంజనీర్ పాలెపు వీరబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి మంచి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని పట్టుదలతో సాధించాలన్నారు. యూత్ డెవలపర్స్ సంస్థ సభ్యుడు రేకాడి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరేళ్లుగా తమ సంస్థ ద్వారా ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ అందజేశారు. ప్రతిభగల విద్యార్థులను, అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ ఐక్యవేదిక సభ్యులు సంగాడి రాంబాబు, వైదాడి నూకరాజు, యూత్ డెవలపర్స్ సభ్యులు రేకాడి వెంకట్‌కుమార్, సంగాడి అంజి, మాతరాజు, లక్ష్మణరావు, కామేష్ పాల్గొన్నారు.

# గోర్స-పండూరు రోడ్డుకు మోక్షం

• హమ్మయ్య గోతులు పూడ్చారు



బంటా గోతులు పూడ్చి నిర్మించిన గోర్స-పండూరు రహదారి

కొత్తపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు గోర్స-పండూరు ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు పూర్తి చేశారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో పాలకులు ఈరోడ్డులో ఏర్పడిన చిన్న గుంతల్లో కనీసం తట్టమట్టి కూడా వేయకుండా వదిలేశారు. దీంతో ఐదేళ్ల పాటు చిన్న గుంతలు పెద్ద బంటా గోతుల్లా మారాయి. బైక్‌పై వెళ్లే ప్రయాణికులు వర్షం కురిసిన సందర్భాల్లో ఎక్కడ గోతులున్నాయో తెలియక ప్రమాదాలపాలయ్యేవారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ రహదారుల మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. పిఠాపురం నుంచి ఉప్పాడ రోడ్డు, గోర్స నుంచి పండూరు వెళ్లే రహదారిలో ఏర్పడిన భారీగోతులను పూడ్చి మరమ్మతులు చేపట్టారు. ఐదేళ్ల గుంతల రోడ్లపై ప్రయాణించలేక నరకయాతన అనుభవించిన ప్రయాణికులు రోడ్లకు మరమ్మతులు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేటి నుంచి ఉచిత పశువైద్యశిబిరాలు : ఏడీ సురేష్‌బాబు



కరప, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఈనెల20 నుంచి 31వరకు అన్ని గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ యస్‌జేయస్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిబిరాల్లో లేగదూడలకు ఏలిక పాముల నివారణ, పాడిపశువుల్లో జలగవ్యాధి నివారణ, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, వ్యాధినిరోధక టీకాలు, పశువుల్లో వచ్చే వివిధ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 20న గొర్రిపూడి, 21న గురజనాపల్లి, ఉప్పలంక, కూరాడ, 22న పెనుగుదురు, వాకాడ, 23న వేములవాడ, పెదకొత్తూరు, 24న వలసపాకల, సిరిపురం, 25న యండమూరు, జి.బావారం, 27న నడకుదురు, వేళంగి, 28న కరప, పాతర్లగడ్డ, పెద్దాపురప్పాడు, 29న విజయరాయుడుపాలెం, కొంగోడు, 30న కొరిపల్లి, జడ్.బావారం, 31న అరట్లకట్ట, గొడ్డటిపాలెం గ్రామాల్లో ఉచిత పశువైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. పశువైద్యులు ఎం.రవికిరణ్‌బాబు, అనిల్ విల్సన్, ఎం.రాజలక్ష్మి, టీవీ సురేష్‌లు రెండు బృందాలుగా శిబిరాలకు నేతృత్వం వహిస్తారని, పాడిరైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు.

## సిద్ధార్థానగర్ కాలనీవాసులతో ఎమ్మెల్యే నానాజీ సమావేశం



సర్పవరం జంక్షన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్ 3వ డివిజన్ సిద్ధార్థానగర్‌లో ఆ కాలనీవాసులతో ఆదివారం ఎమ్మెల్యే పంతం నానాజీ సమావేశమయ్యారు. సిద్ధార్థానగర్ సంక్షేమం సంఘం సభ్యులు మాట్లాడుతూ కాలనీవాసుల ఆహ్లాదం, వ్యాయామం కోసం అస్తవ్యస్తంగా ఉన్న పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ముందుంటానని, కాలనీవాసుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలతో పార్కు ఆధునీకరణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పలు సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసుల సమస్యలు తెలుసుకునేందుకు వచ్చిన నానాజీకి కాలనీ పెద్దలు, సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## నాగులాపల్లిలో ఫ్యాన్సీ దుకాణం దగ్ధం

కొత్తపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నాగులాపల్లిలో ఆదివారం అర్ధరాత్రి కరెంటు షార్ట్‌షర్క్యూట్ కారణంగా ఫ్యాన్సీ షాపు దగ్ధమైంది. గొర్ల అప్పలస్వామి స్థానికంగా కిరాణా, ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. రాత్రి 9గంటలకు షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం అర్ధరాత్రి షాపులో పొగలు వస్తున్నాయన్న సమాచారంతో వెళ్లేసరికి షాపులో సామగ్రి మంటల్లో బూడిదయ్యాయని గంగరాజు వాపోయాడు. రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

## యానాం బీచ్‌లో ఎస్పీ బోటు షికారు



యానాం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ బీచ్‌లో సంక్రాంతి సెలవుల నేపథ్యంలో వారం రోజులుగా పర్యాటకులు తాకిడి కొనసాగుతోంది. యానాం పర్యాటక శాఖ ఆధీనంలోని సీగల్స్ రెస్టారెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బోటింగ్ ద్వారా వృద్ధ గౌతమి గోదావరి నదిలో పర్యాటకులు బోటు షికారు చేస్తున్నారు. ఆదివారం యానాం వచ్చిన కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కుటుంబ సమేతంగా యానాం పర్యాటక అందాలను వీక్షించి గౌతమి గోదావరిలో బోటు షికారు చేశారు.

## 'అమిత్‌షాను విమర్శించే నైతిక హక్కు షర్మిలాకు లేదు'

సర్పవరం జంక్షన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలాకు లేదని కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రాస్ కాంగ్రెస్‌పార్టీ అన్నారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వారసులైన అమిత్‌షాను విమర్శిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏపీని ఆ పార్టీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ దోచుకున్నారని, ఆయన వారుసురాలైన మీరా కేంద్ర హోంశాఖ మంత్రిని విమర్శించేది అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, బీజేపీ కూటమిల ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకువెళుతుందనానరు. దీంతో తల్లి, పిల్ల కాంగ్రెస్ పార్టీ వెన్నులో వణుకు మొదలైందని విమర్శించారు. రాజకీయ మనుగడ కోసం హోంమంత్రిపై బురద జల్లాలని చూస్తే ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు.

# కేంద్ర మంత్రి గోబ్యాక్ అంటూ సీపీఎం ధర్నా



తాళ్లరేవులో ధర్నా చేస్తున్న సీపీఎం పార్టీ నేతలు

తాళ్లరేవు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గోబ్యాక్ అంటూ సీపీఎం నేతలు తాళ్లరేవులో ఆదివారం ధర్నా చేశారు. ఈసందర్భంగా సీపీఎం నేతలు మోర్త రాజశేకర్, కమిడి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ అమిత్‌షా మాట్లాడటం బాధాకరమని, అమిత్‌షాను కేంద్రమంత్రి మండలి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ వ్యవస్థను, అంబేడ్కర్ బావజాలాన్ని మాయంచేయాలనే కుట్రతో ఆర్ఎస్ఎస్ బాటలో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సీపీఎం నేతలు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, చెక్కా రమణి, త్రిమూర్తులు, వెంకటలక్ష్మి, మంగమ్మ, సంతోష్‌కుమార్, గేడి భాస్కరరావు, పులపకూర గోపాలకృష్ణ, చైతన్యరెడ్డి పాల్గొన్నారు.

## 'పోర్టులో స్థానిక లారీలకు లోడింగ్ కల్పించి ఆదుకోవాలి'

కాకినాడ సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాలుగా పోర్టుపై ఆధారపడి జీవనం సాగిస్తున్న స్థానిక లారీల యజమానులు, కార్మికుల ఉపాధిని కొంతమంది దెబ్బతీస్తున్నారని, పోర్టులో స్థానిక లారీలకు లోడింగ్ కల్పించి ఆదుకోవాలని కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలిసి కోరారు. అసోసియేషన్ సభ్యులు, కార్మికులతో కలిసి కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్‌కు వినతిపత్రం ఆదివారం సమర్పించారు. కొంతమంది వ్యక్తులు స్థానిక లారీలకు లోడింగ్ లేకుండా చేస్తుండటంతో కార్మికులు ఎంతో ఆందోళన చెందుతున్నారని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ మూడు రోజుల్లో ఇరుపక్షాలతో జాయింట్ సమావేశం ఏర్పాటుచేసి నిర్ణయం తీసుకుంటామని, అంతవరకు పోర్టులో లోడింగ్‌కు ఏవిధంగా ఆటంకాలు కలిగించరాదని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, కార్యదర్శి అల్లం రాజు, ఉపాధ్యక్షుడు కె.అర్జున్‌రాజు, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎలిపే శ్రీనివాస్, లారీ యజమానులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.







## మురారి దుర్గమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

గండేపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారి దుర్గమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కోళ్లు, మేకలు మొక్కులు చెల్లించుకుని కుటుంబీకులతో కలిసి భోజనాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటుచేసి జగ్గంపేట సీఐ వైఆర్కే.శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

# రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



నిత్యావసర సరుకులు అందజేస్తున్న రామకృష్ణ మిషన్ ప్రతినిధులు

## పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ

రంపచోడవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో సిరిగిందలపాడులో 17 మంది పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్టు కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ తెలిపారు. ఒక్కొక్కరికి కిలో కందిపప్పు, కిలో మినపపప్పు, కిలో పంచదార, కిలో గోధుమపిండి, కిలో వేరుశెనగగుళ్లు, కిలో ఇడ్లీ రవ్వ, కిలో వంటనూనె, టీ పొడర్‌తో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు తలారి వెంకట సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, సంపత్‌కుమార్, దాసరి ఉమామహేష్, పంచాయతీ కార్యదర్శి బీఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, క్యాంపు కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వలంటీర్లు సూర్య, దాసరి పెద్ద అప్పారావు పాల్గొన్నారు.





పాపికొండలు వెళ్తున్న బోటు, గండిపోశమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

## పాపికొండలకు పర్యాటకుల తాకిడి

దేవీపట్నం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు అనేక రాష్ట్రాల నుంచి పర్యాటకులు పాపికొండలు విహారయాత్రకు ఆదివారం పోటెత్తారు. పోశమ్మ గండి బోటు పాయింటు 15 బోట్లలో సుమారు 985 మంది పర్యాటకులు పాపికొండలు మీదుగా పేరంటాలపల్లి వెళ్లారు. అక్కడ గిరిజనులు తయారు చేసిన వెదురు బొమ్మలను కొనుగోలు చేసి జలపాతాల వద్ద సందడి చేశారు. అక్కడి నుంచి కొంతమంది పర్యాటకులు వేరే బోటులో భద్రాచలం వెళ్లారు. గండి పోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకుజా ము నుంచి గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు.

## 'పెదరమణయ్యపేట గ్రామానికి తారు రోడ్డు వేయాలి'

దేవీపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద రమణయ్యపేట గ్రామానికి తారు రోడ్డు వేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఆ రోడ్డు పరిస్థితిని ఆదివారం ఆదివాసీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు కావొస్తున్నా ఇక్కడ రోడ్డు వేయలేదన్నారు. వర్షాకాలంలో ఈ రోడ్డు వెంబడి ప్రయాణించడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచినీటి సదుపాయం లేక నూతి నీళ్లు తాగుతున్నారని... జలజీవన్ మిషన్ ద్వారా సురక్షిత నీరు అందించాలని, అంగన్‌వాడీ భవనం లేదని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు.



పెదరమణయ్యపేట రోడ్డును పరిశీలిస్తున్న ఆదివాసీ నాయకులు

ఆదివాసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, కుండ్ల సాయిరాంరెడ్డి, తుర్రం ఆదినారాయణదొర తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

ఎటపాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నలకుంట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో-2 సరియం రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఆహ్వానాలు పంపారు.



వి.కొత్తూరులో ముందుకు సాగని భవన నిర్మాణ పనులు

## అక్కరకు రాని కస్తూర్బా విద్యాలయ

**నత్తనడకన భవనాల నిర్మాణం... నాలుగున్నరేళ్లుగా కొనసాగుతున్న పనులు**

తుని రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.కొత్తూరు కేజీబీవీ పాఠశాల విద్యార్థులను సమస్యలు వీడట్లేదు. ఈ పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం రూ.1.60 కోట్లు కేటాయించింది. నిర్మాణ పనులకు 2020 ఆగస్టు 13న అప్పటి ప్రజా ప్రతినిధులు ఆర్భాటంగా శ్రీకారం చుట్టారు. పనులను ఏడాదికి పూర్తి చేసి అప్పగించాల్సి ఉన్నా కాంట్రాక్టరు అలసత్వంతో నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఫలితంగా విద్యార్థులు ఇరుకు గదుల్లో సతమతమవుతున్నారు. పాఠశాల, జూనియర్ కళాశాల భవనాలను అందుబాటులోకి తెచ్చేందుకు ఉన్నతాధికారులు చొరవ చూపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



రోడ్డు నిర్మాణంలో భాగంగా తూరలు వేస్తున్న దృశ్యం

## ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మోక్షం

జగ్గంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరం నుంచి మర్రిపాక వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు నేషనల్ హైవే నుంచి రామవరం పుష్కర కాలువ వరకు అధ్వానంగా ఉంది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో దీనికి మోక్షం కలిగింది. 335 మీటర్ల పొడవు గల ఈ రోడ్డు దారుణంగా పాడవ్వడంతో సిమెంటు రోడ్డు, డ్రైను నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.84లక్షలు మంజూరు చేయించారు. ఆదివారం కల్వర్టుకు సిమెంటు తూరలు వేసే పనులు ప్రారంభించి శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఎమ్మెల్యే చొరవతో ఈ రోడ్డుకు మోక్షం కలిగిందని రామవరం కాలనీవాసులు, మర్రిపాక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

## 'మామాడి'పైనే ఆశలు!

**సస్యరక్షణ చర్యల్లో మెట్ట రైతులు**

**ఏటా 150 మెట్రిక్ టన్నుల దిగుబడి**



తుని రూరల్‌లో మామిడి పూతను కాపాడుకునేందుకు రసాయనాలు పిచికారీ చేస్తున్న దృశ్యం

తుని రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మామిడికి పెట్టింది పేరు కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంతం. ఇక్కడి మామిడి పండ్లకు మంచి మార్కెట్‌తో పాటు డిమాండ్ ఉంటుంది. మామిడిని నమ్ముకున్న రైతులకు ప్రతి ఏటా ఎంతోకొంత నష్టం వాటిల్లుతోంది. పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో చాలా చోట్ల మామిడిచెట్లను నరికేస్తూ ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గుచూపుతున్నారు. తుని సబ్ డివిజన్ పరిధిలో 40వేల ఎకరాలకు పైబడి మామిడి తోటలు ఉన్నాయి. వాటి నుంచి ఏటా 1.60 మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మామిడి తోటలు తెల్ల పూత వచ్చి పూల మొగ్గ దశలో ఉన్నాయి. మంచు ప్రభావంతో దెబ్బతిన్న మామిడి పంటను కాపాడుకోవడానికి రక్షణ చర్యలు చేపట్టి ఈ ఏడాదైనా అధిక దిగుబడులు సాధించేందుకు శ్రమిస్తున్నారు. మెట్టలో మామిడి పంట మొత్తం విస్తరణంలో 60శాతం బంగినపల్లి, 40శాతం వివిధ రకాల మేలు జాతులు సాగులో ఉన్నాయి. మామిడి తోటల్లో ప్రతిఏటా డిసెంబరు నుంచి జనవరి ఆరంభం వరకు పూతలు వస్తాయి. ఫిబ్రవరి మొదటి నుంచి పూత వచ్చిన తోటల్లో కాయలు చేతికి వస్తాయి. మామిడితోటను రైతులు కొందరు కాపు వరకు వ్యాపారులకు విక్రయించడం, మరి కొందరు తామే కాయలు కొని మార్కెట్‌కి తరలించి విక్రయిస్తుంటారు. వ్యాపారులు ఇక్కడి నుంచి ఒడిశా, ముంబై, నాగపూర్, లక్నో, ఢిల్లీలకు ఎగుమతి చేస్తారు.





నల్లగొండ అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ఊరేగింపుగా వస్తున్న మహిళలు

## నల్లగొండ అమ్మవారికి బోనాల సమర్పణ

తుని రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తుని పట్టణ శివారు ఎస్.అన్నవరం గ్రామ దేవత నల్లగొండ అమ్మవారికి బోనాల సంబరం ఆదివారం కనుల పండువగా జరిగింది. వందలాది మంది మహిళలు తలపై బోనాలు పెట్టుకుని గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల అనంతరం బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వేలాది మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తుని రూరల్ పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.



ధర్మవరం హైస్కూల్లో 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల గ్రూప్ ఫొటో

## ధర్మవరంలో అ'పూర్వ' సమ్మేళనం

ప్రత్తిపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అద్దేపల్లి అచ్యుతరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 92 మంది విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాలతో గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ప్రస్తుతం గొల్లప్రోలు, కిర్లంపూడి ఎంఈవోలుగా వున్న శివప్రసాద్, చిన్నారావులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమను గుర్తు పెట్టుకుని పిలవడం సంతోషదాయకమన్నారు. ధర్మవరం హైస్కూలు అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.



కోటనందూరు బస్టాండు సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

## స్వచ్ఛాంధ్ర సాధ్యమెలా!

కోటనందూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తుని-నర్సీపట్నం రహదారిపై కోటనందూరు శ్రీతలుపులమ్మ తల్లి గుడి సమీపంలో రోడ్డుపై మురుగు నీరు నిత్యం వర్షంలా ప్రవహిస్తోంది. ఆఫీసులు, ఇతర పనులపై వెళ్లేవారిపై పక్క నుంచి వెళ్లే పెద్ద వాహనాలు మురుగునీరు చిమ్ముతుండడంతో వారి దుస్తులు పాడైపోయి మరలా ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్య గురించి అధికారులకు ఏళ్ల తరబడి చెప్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఒకవైపు ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర అంటూ ప్రచారం చేస్తున్నా తమ సమస్య పరిష్కారానికి నోచుకోవట్లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

## విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటికి నష్టం

తొండంగి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్ళపురం పంచాయతీ ఆవులమంద గ్రామానికి చెందిన అంబుజాలపు చంటియ్య ఇంట్లో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. ఇంటితో పాటు వస్తువులకు నష్టం వాటిల్లింది. బాధిత కుటుంబాన్ని టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, బీసీ సెల్ కార్యదర్శి కొయ్యా రామకేశవ, కోడ వెంకటరమణ, ఒంటిమామిడి సర్పంచ్ అంగులూరి సుధాకర్, చొక్కా అప్పారావు, కాలిబోయిన చంద్రరావు, మనిమెల కొండబాబు పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని రాజేష్ హామీ ఇచ్చారు.



బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందిస్తున్న టీడీపీ నాయకులు



గౌరీశంకరుల విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకులు

## గౌరీశంకరుల నిమజ్జనం

ప్రత్తిపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గౌరీశంకరుల 88వ వార్షిక మహోత్సవాలను మూడు నెలలు ఘనంగా నిర్వహించారు. వివాహమైన యువకులు సాంబశివుడు, గౌరీదేవి విగ్రహాలను శిరస్సుపై పెట్టుకుని ఊరేగింపుగా తీసుకెళ్లి రామభద్రరావు చెరువులో నిమజ్జనం చేశారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు 101 శూలాలతో ప్రదర్శన, డప్పుల డ్యాన్సులు, అఘోరాల వేషధారణలు, ఆంజనేయుడి వేషధారణ, మంగళవాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

## సూది మందు వికటించి బాలుడు మృతి

**తునిలో ఘటన... ఆలస్యంగా వెలుగులోకి**

తుని రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ముస్లిం వీధిలోని ఒక ఆసుపత్రిలో సూది మందు వికటించి ఆరు సంవత్సరాల బాలుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాడేరు సమీపంలో గిరిజన గ్రామానికి చెందిన బాలుడి తల్లిదండ్రులు సదరు ఆసుపత్రిలో చికిత్స చేయించగా ఈ విధంగా జరిగినట్టు తెలిసింది. ఏడో వార్డుకు చెందిన ఓ నాయకుడు ఈ వ్యవహారంలో తలదూర్చి కొద్దిమొత్తంలో సెటిల్‌మెంట్ చేసి బాలుడి మృతదేహాన్ని పంపించినట్టు సమాచారం. శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆదివారం వెలుగులోకి రాగా స్థానికంగా చర్చనీయాంశమైంది.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు

## 'లోవ'లో భక్తుల కిటకిట

తుని రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబసమేతంగా వచ్చిన వారు దేవస్థానం ఏర్పాటుచేసిన వసతి గదుల్లో వంట-వార్పు చేసుకుని భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజు ఆదాయం రూ. 5.87లక్షలు వచ్చినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

లోవకు తరలివెళ్లే ద్విచక్రవాహనచోదకుల నుంచి టోల్‌గేటు వద్ద రూ.10 వసూలు చేయాల్సి ఉంది. అయితే రూ.20 వసూలు చేస్తున్నారు. దీంతో తునికి చెందిన పలువురు భక్తులు, టోల్‌గేటు నిర్వాహకుల వద్ద మధ్య వివాదం నెలకొంది. అక్కడ కొద్ది సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందిపడ్డారు.

**ఆర్వో ప్లాంటు ప్రారంభం**

దాతల సహకారంతో లోవలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ఈవో విశ్వనాథరాజుతో కలిసి టీడీపీ నాయకుడు, తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు ఆదివారం ప్రారంభించారు. దీనిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 'తుమ్మలపల్లి' హర్షం

జగ్గంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంటును ఆదుకునేందుకు భారీ ఆర్థిక ప్యాకేజీ ఇస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్యాకేజీతో స్టీల్‌ప్లాంటుకు పూర్వ వైభవం వస్తుందన్నారు. గతంలో జనసేన అధి నేత పవన్‌కల్యాణ్ వివిధ రూపాల్లో స్టీల్ ప్లాంటును ప్రయివేటీకరణ చేయవద్దని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఎన్నికల సమయంలో కూడా కేంద్రంతో ఈ అంశంపై చర్చించారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కూటమి నాయకులు చేసిన ప్రత్యేక కృషితో విశాఖ స్టీల్‌ప్లాంటుకు రూ.11,440కోట్లు ప్రకటించడంపై ప్రధాని మోదీకి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## సత్యదేవుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి ఆదివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కామేశ్వరరావు విచ్చేశారు. ఆయనకు ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామి దర్శనం, ప్రత్యేక పూజల అనంతరం న్యాయమూర్తికి పండితులు వేదాశీర్వచనాలు, ఈవో ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.